


# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

**ఆవాళ** 1945 ఆగష్టు ఆరో తారీఖు. ఉదయం ఎనిమిది గంటలకి మా యూనిట్ గ్రౌండులో దహనకాండ జరుగుతూంటే, ప్రపంచంలో మరో చోట అదే సమయంలో ఒక మహాదారుణ దహనకాండకి ప్రయత్నం సాగిపోతూంది.

హిరోషిమా నగరవాసులు అమాయకంగా ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఎనిమిది గంటలపదిహేను నిమిషాలకి ఒక అమెరికను బి–20 బాంబరు మరి రెండు విమానాలతో సహా సుమారు యిరవై యెనిమిది వేల అడుగుల యెత్తునుంచి నగరం మధ్యకి ఒకే బాంబు విడిచి పెట్టింది.

అది అణుబాంబు. నిముషం తరవాత ఆ బాంబు భూమికి పద్దెనిమిది వందల అడుగుల యెత్తున పేలింది. వెంటనే మూడులక్షల డిగ్రీల వేడితో, నూటయెనభై అడుగుల వ్యాసంగల ఒక ప్రళయాగ్ని గోళం జాజ్వల్యమానంగా ప్రభవిల్లింది.

ఈ భయంకర విస్ఫోటనం నగరాన్ని దుంప ధూళి చేసింది.

ఈ వార్త మాకా సాయంత్రం తొమ్మిదింటకి తెలిసింది. వెంటనే ఓ.సీ. పరుగెత్తుకు నా గది కొచ్చేడు.

“హవల్దార్! నా దగ్గిర యెన్ని సీసాలున్నాయి!"

“అరవందుంటై…”

“ఓకే! అన్నీ సిద్ధం చెయ్యి…"

ఓ.సీ. కోరిక ప్రకారం అందర్నీ రిక్రియేసను క్లబ్బులో సమావేశపరిచా. అందరి గ్లాసులూ నిండుగా వున్నాయి! ఓ.సీ. కూడా ఓ గ్లాసు పట్టుకున్నాడు.

“వినండి! మనం యిప్పుడీ చిన్నపండుగ యెందుకు చేసుకుంటున్నామో తెలుసా?”

ఎవ్వరూ జవాబు చెప్పలేదు. వాళ్ళకి తెలీదు.

“వినండి! ఈ వుదయం జపాను త్రుటిలో నాశనమైంది. శత్రువుల నడ్డి విరిగిపోయింది. నాలుగు రోజుల్లో బేషరతుగా లొంగిపోకపోతే జపాను దీవులు ప్రపంచపటంలోంచి తొలగిపోతాయని వాళ్ళకి తుది హెచ్చరిక అందజేసేం. ఇప్పుడే రేడియోలో ఆ వార్తవిన్నా. నాలుగు రోజులకి ముందుగానే శత్రువులు బేషరుతుగా లొంగిపోవాలని ఆశిస్తూ… ఆ ఆశతోనే, యిప్పుడు… చీరియో!"

అంతా తాగేరు.

“ఇక జపాను బేషరతుగా లొంగిపోగానే వెంటనే నిజమైనవిందు ఘనంగా చేసుకుందాం… వెళ్ళి పడుకోండి గుడ్ నైట్!”

20

ఆగష్టు తొమ్మిదో తారీకున మళ్ళీ ఆటంబాంబు పేలింది. మర్నాడే జపాన్ బేషరతుగా లొంగిపోయినట్టు ప్రకటించింది.

ఆనాడు వుదయం నించి సాయంత్రం వరకూ ఒకటే కోలాహలం. ఏడుగంటలకి విజయ సూచకంగా శతఘ్నులు పేలేయి. సైరన్లు మ్రోగేయి. అవిచాలక అంతా దొరికిన డబ్బాలు, డొక్కులు పట్టుకు వాయించేరు. అలా పావుగంట సేపు ఆగకుండా శబ్దంతో భూమి, ఆకాశం నిండింది.

ఆ వేళ మా యూనిటులో యెన్ని కోళ్ళ మెడకాయలు తెగేయో చెప్పలేం.

అది విచ్చలవిడి దినం. సిపాయిలు ఒంటిమీద అంగుళం గుడ్డయినా లేకుండా అంతటా తిరిగేరు. ప్రజలు వాళ్ళని చూసి నవ్వుకున్నారు. బైటకొచ్చిన స్త్రీలు కొందరు యిళ్ళలోకి పారిపోయేరు.

ఆ వేళ కొందరు అమెరికను సోల్జర్లు ఆనందం పట్టలేక మితిమీరిన పన్లుచేసేరు.

ఒక సబ్ యిన స్పెక్టరు కూతురు, ఇరవై ఏళ్ళ పిల్ల మా యూనిటు పక్కనించే కాలేజీకి వెళ్ళిపోతుంది. అక్కడే ఒక అమెరికను ఆసుపత్రి వుంది. అందులోంచి పదిమంది బాగా తాగొచ్చేరు. ఆ పిల్లని చుట్టుముట్టి, కడియం కట్టి దొమ్మరి డాన్సు చేసేరు. తరవాత ఆమె మీద పడి ఆప్యాయంగా ముద్దులు కురిపించేరు. అంతవరకూ ఆమె సహించింది. చివాల్న పైటవార నుంచి పిస్తోలు తీసి మీదికి రెండు గుళ్ళు పేల్చింది. ఒక్కసారి అంతా వెనక్కి తగ్గేరు. కాని వెనక నించి ఒకడు ఆమె చేతిలో పిస్తోలు లాక్కున్నాడు. ఎదురుగా ఒక రిక్షా వస్తూంది. ఇద్దరు గబగబ వెళ్ళి రిక్షావాణ్ణి రెండు వేసేరు. వాడు రిక్షా దిగి పారిపోయేడు. వాళ్ళ రిక్షాలో వున్న పెద్ద మనిషిని కిందికి లాగేసారు వెంటనే ఆ అమ్మాయిని గంజీ కావడిపట్టి తీసుకొచ్చి రిక్షాలో కూచో పెట్టేరు. ఆమెతో పాటు మరో యిద్దరు చంగున రిక్షా యెక్కారు, ఒకడు రిక్షా తొక్కుకు తీసుకుపోయేడు. వీధి కొసని రిక్షాని, అమ్మాయిని వదిలి నవ్వుకుంటూ వచ్చేరు.

వాళ్ళ వీధిని కారొచ్చినా, బస్సొచ్చినా, మనిషొచ్చినా, ఆడగానీ, మగకానీ, కడియంకట్టి నృత్యంలో కొంతదూరం దిగబెట్టి, అక్కడ నాలుగు ముద్దులు పెట్టుకుని మరీవొదుల్తున్నారు.

రాత్రి మరీ దీపాలతో చిట్టగాంగు ధగధగ మెరిసిపోయింది. బాణ సంచా కాల్చేరు. తిరిగి శతఘ్నులు మ్రోగేయి.

“బార్" మా రిక్రియేషను క్లబ్బులోనే యేర్పరచేం. అంతా ఒక పద్ధతి ప్రకారం నడిపించడానికి నేనొక పథకం వేశా. ఓ.సీ. కి సార్జంటు మేజరుకి చెప్పా. –

“రాత్రి సరిగ్గా తొమ్మిది గంటలకి సార్జంటు మెస్సుకి కబురు పెడతా. తొమ్మిదిగంటల పదినిముషాలకి ఆఫీసర్ల మెస్సుకి కబురంపుతా. తొమ్మిదింపావుకి ఆరంభం” ఇద్దరూ ఓకే అంటే ఓకే అన్నారు.

బీరు, రమ్ము, జిన్ను మొత్తం సుమారు నాలుగువందల సీసాలున్నాయి. క్లబ్బుహాలు చక్కగా కాయితపు పువ్వులతో, గొలుసులతో అలంకరించేరు. హాలుకి నాలుగు ద్వారాలున్నాయి. ఎడమవేపు "కౌంటరు" వుంది. ఓ పక్కన ఐదువందల ఖాళీ గ్లాసులున్నాయి. దూరంగా మనిషి చేతికి దొరక్కుండా గోడ దగ్గిర సీసాలున్నాయి. రెండు వందల మంది కూచుందికి కుర్చీలు, టేబిళ్ళు, బెంచీలు సర్దేరు. కౌంటరు పెద్ద లహరీ. అతనికి ముగ్గురు సిపాయిలు తోడు.

ఓ.సీ. ఆరుగంటల కొచ్చి చూసి యేర్పాట్లు బాగున్నాయని మెచ్చుకొన్నాడు.

ఎనిమిదిన్నర దాటిన దగ్గర్నించీ సిపాయిలు తహతహలాడిపోతున్నారు. వాళ్ళ ఓర్మి తగ్గిపోతూంది, 'బాబూ! ఇంకా యెంతసేపు?' 'సారూ యిన్నుం యెత్తన నేరం?" ఆ క్యా దేరీ హై సాబ్! 'శురూకరో!' ఒకటే తపన, హాలుచుట్టూ పులుల్లా తిరుగుతున్నారు. కాని "లోనికి ప్రవేశం లేదు," చాలా కట్టుదిట్టం చేశా, నా చాకచక్యానికి నేనే మురిసిపోయా.

సరిగ్గా ఐదు నిముషాలు తక్కువ తొమ్మిదికి అంతా లోన ప్రవేశించేరు. సుమారు రెండువందల మంది. "ఆర్డర్, ఆర్డర్! అంతా కూచోండి. ఊఁ – వన్ బై వన్!– ఒక్కొక్కరే!" – ఒకొక్కరే నిమ్మళంగా కౌంటరు దగ్గర కెళ్ళి, ఒక్కొక్క ఖాళీ గ్లాసు తీసుకుని తిరిగి సీటుదగ్గిర కెళ్ళి నిశ్శబ్దంగా కూచోండి. నెమ్మది. నెమ్మది. అదిగో! ఏమిటా తోపులాట! ఎటెన్...షన్! అది బాగుంది. ఇప్పుడు ఒక్కొక్కరే... ఒక్కొక్కరే... ఎవరా గుసగుసలు? కిచకిచలు?" మొత్తానికందరూ గ్లాసులు పుచ్చుకున్నారు.

తొమ్మిదైంది. "మాత్యూస్! వెళ్ళి సార్జంట్ల మెస్సుకి కబురు చెప్పిరా..."

మాత్యూస్ వెళొచ్చేడు. "సార్జంట్ల మెస్సులో యెవరూ లేరు..."

"లేరా! ఏమైపోయేరు?"

"తెలీదు సార్?"

తొమ్మిదింపావు దాటింది ఒక్కరూ రాలేదు. వాళ్ళెక్కడున్నారో తెలీదు. కొండమీదకెళ్ళి ఆఫీసర్ల మెస్సులో వున్నారేమో అని చూశా. అక్కడా లేరు. ఆఫీసర్లని నాతో తీసుకొచ్చా.

ఇంతలో ఒక్కొక్క సార్జంటూ వస్తున్నాడు. వాళ్ళు అంతకముందే స్వంతమెస్సులో చిత్తుగా తాగి, బైటకొచ్చి, అక్కడికక్కడే దారి తప్పిపోయి, చెట్లచుట్టూ రాళ్ళచుట్టూ తిరుగుతూ, కక్కూసుల్లో దూరుతూ వాళ్ళలో వాళ్ళే కొత్త వాళ్ళలా మా క్లబ్బుకి దారి అడుక్కుంటున్నారు.

మొత్తానికంతా వచ్చేసరికి తొమ్మిదిన్నర దాటింది. "అందరూ దయచేసి కూచోండి" అన్నాను.

ఎపరేట్ అనే సార్జంటు "ఎందుకూ?" అన్నాడు. అంతా గొల్లున నవ్వేరు. అతను మూడుచక్కర్లు తిరిగి నవ్వుతూ డ్యాన్సు చేసేడు.

"ప్లీజ్ ప్లీజ్! అంతా కూచుంటే మనం ఆరంభిద్దాం" నేనే దీనంగా అన్నా.

మరో సార్జంటు తూలుతూ లేచి, "ఆరంభం ఎప్పుడో అయింది. మళ్ళీ కొత్తగా ఆరంభించేదేమిటి" అని అహహహ అని నవ్వేడు. తిరిగి అంతా గొల్లున నవ్వేరు.

నలుగురైదుగురు తెల్లవాళ్ళు కౌంటరు దగ్గరికి జొరపడి "ఏయ్ లహరీ! నగుల్ పానీదేవ్!" అన్నారు గ్లాసులు కౌంటరుమీద టకటకలాడిస్తూ. లహరీ వాళ్ళకి పోసేడు.

అంతే! జూలో జంతువులన్నీ బోన్లు విరుచుకు బైటకొచ్చినట్టు అంతా ఒక్కసారి కౌంటరు మీద విరుచుకుపడ్డారు. గ్లాసులు టకటక లాడించేరు. కౌంటరెక్కిపోయేరు. అది విరిగిపోయింది. నిండుసీసా లందుకున్నారు. కార్కులు టపాటపా ఎగిరేయి. గళాసులు, సీసాలు తెబ్బె తెబ్బెలయేయి. హాలంతా గాజు పెంకులమయం.

ఒకమూల ఒకడు బుల్ బుల్ వాయిస్తున్నాడు. ఓ.సీ. చప్పట్లు కొడుతున్నాడు. కొందరు అడుగులు వేస్తున్నారు. కాయితపు గొలుసులు తెంచి కొందరు మెళ్ళో వేసుకున్నారు. కొన్ని ఓ.సీ. తదితర ఆఫీసర్ల మెడలో వేసేరు. ఒక దగ్గిర అరుశయ్య "ఎన్.ఎస్. కృష్ణన్, టి.ఎ. మధురం"ని అనుకరిస్తూ హాస్యం చెప్తూ పాటలు పాడుతుంటే వింటూన్న వాళ్ళు విరగబడి నవ్వుతున్నారు.

హాలు తొడతొక్కిడిగా వుంది. ఈ లోగా కుంజన్ అనే మలయాళీ సిపాయి బాకుతీసి, చేతులూ కాళ్లూ జోరుగా తిప్పుతూ "బాకు డ్యాన్సు" చేసేడు. ఎవడి పీక ఎగురుతుందో అని జంకా. కాని అలాంటిదేం జరగలేదు.

నిషాయెక్కుతున్న కొద్దీ వెర్రివికారాలు మారుతున్నాయి.

పోలయ్య డ్రైవరు, యాభైయేళ్ళవాడు. నల్లగా పొడుగ్గా సొండులా వుంటాడు. తెల్లటి పళ్ళు, బట్టతల, అతను పెళ్ళికూతురు. ఒక సార్జంటు పెళ్ళికొడుకు. మాత్యూసు మతగురువు. చిరిగిపోయిన కాగితపు గొలుసు ముక్క గ్రంథంలా పట్టుకుని చదువుతూ వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసేడు. వాళ్ళు కాయితపు గొలుసులు ఒకరి మెళ్ళో ఒకరు వేసుకున్నారు. చెట్టాపట్టాలేసుకొని అక్కడే రెండడుగులు "హనీమూన్" ప్రయాణం చేసేరు. పక్కనున్న బెంగాలీ టర్నరుమిత్రా "ఒరే పోలయ్యా! నువ్వు పెళ్ళికూతురివా" అని యెగతాళి చేసేడు పోలయ్యకి కోపం వచ్చింది. అంత వరకూ తను పెళ్ళికొడుకనుకుంటున్నాడు. కాని నిజం తెలియగానే కోపం మండిపోయింది. సార్జంటు మీద, మాత్యూస్ మీదా భూతంలా తిరగబడ్డాడు. అక్కడొక చిన్నకుమ్ములాటయింది. కాని సర్దుకుంది.

ఆటలు – పాటలు, మాటలు, నృత్యాలు, తోపులాటలు, దొమ్ములాటలు, హాలు వెదురు గోడలు వంగిపోతున్నాయి. అక్కడక్కడ విరిగిపోయేయి. రాత్రి పన్నెండైంది. అంతా యేదోస్వరంలో వున్నారు. ఇంతలో గణేశన్ అనే ఫిట్టరు గుభీమని బల్లెక్కి నిలబడి "ఫ్రండ్స్ రోమన్స్, మైకంట్రీమెన్" అని ఆరంభించి అరవంలో యేదో లెక్చరు దంచేడు. అతనిని చూసి సార్జెంటు మేజరు మరొక బల్లెక్కి "ఓయంగ్ లోకిన్ వార్! కమ్ ఔటాఫ్ ద వెస్ట్" అని పాడి "శేర్వాజ్ రేసింగ్ అండ్ చేజింగ్ ఇన్ కేనో బిలీ...." లని చివాల్న జన సముహంలోకి గెంతి గుర్రపుదాటేసేడు. వెంటనే హాహాకారం బైల్దేరింది. ఒక

వందమంది బల్లలెక్కి దొమ్మరి నృత్యం చేసేరు. టేబిలుకి ఒక కోడు విరిగితే మిగిలిన మూడుకోళ్ళ వేపూ జరిగేరు. రెండో కోడు విరిగితే విరగని కోళ్ళవేపు సర్దుకున్నాడు. కాని నృత్యం ఆపలేదు. అన్ని కోళ్ళూ విరిగితే టేబిలుతోబాటు కిందపడ్డాడు. కాని నృత్యం మానలేదు. ఫర్నిచరంతా అగ్గి పుల్లలైపోయింది.

చాలా మందికి తెలివి తప్పిపోయింది. కిందపడి దొర్లుతున్నారు. గది బయట దొర్లిపోయారు. గుట్ట యేటవాలు మీదకి దొర్లిపోయారు.

రెండు గంటలకి అంతా సమాప్తమైంది.

అది “ఆర్మీ స్టీస్ డే సెలిబ్రేషన్"

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments